సాక్షి అనకాపల్లి

సోమవారం, 11, మార్చి, 2024



అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో

నూకతాత పండగను ఆదివారం మత్స్యకారులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వినూత్న సంప్రదాయంతో ఈ పండగ ఎంతో విశిష్టతను చాటుతుంది. 8లో



న్యూస్‌రీల్

రేపు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లి : స్థానిక రింగ్‌రోడ్డు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో ఈనెల 12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాలు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జెండా వందనం చేసి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాలకు అనకాపల్లి నియోజవర్గ పార్టీ కుటుంబ సభ్యులు, జిల్లా, మండల కమిటీ పార్టీ అధ్యక్షులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల యువజన విభాగాల అధ్యక్షులు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, జెసీఎస్ కన్వీనర్లు, కార్యకర్తలు విచ్చేయవలసిందిగా ఆయన కోరారు.

పల్లెల్లో పారామిలటరీ దళాల కవాతు



ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పారా మిలటరీ దళాలు

చోడవరం రూరల్ : రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపడంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశంతో ఆర్మ్‌డ్ రిజర్వు దళాలు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. మండలంలోని ఖండిపల్లి, గవరవరం, లక్కవరం, జుత్తాడ, సింహాద్రి పురం, గజపతినగరం, పి.ఎస్.పేట, బంగారమ్మపాలెం, జన్నవరం, కన్నంపాలెం, తిమ్మన్నపాలెం, బెన్నవోలు తదితర గ్రామాల్లో వీధుల్లో కవాతు నిర్వహించి రానున్న ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ సూర్యనారాయణ, ఆర్మ్‌డ్ రిజర్వు ఫోర్స్ ఆర్ఐ, పోలీసు సిబ్బంది. సుమారు వంద మంది పారా మిలటరీ దళాలు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం



భారీ తాబేలు కళేబరం

కొమ్మాది : సాగర్‌నగర్ బీచ్‌కు ఆదివారం సాయంత్రం భారీ తాబేలు కళేబరం కొట్టుకుని వచ్చింది. సెలవు రోజు కావడంతో పర్యాటకులు ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఉన్నారు. ఒక్కసారిగా భారీ తాబేలు కళేబరం కొట్టుకుని రావడంతో పర్యాటకులు ఆవేదనకు గురయ్యారు. ఇటీవల కాలంలో డాల్ఫిన్‌లు, తాబేళ్లు వరుసగా ఇలా మృత్యువాత పడుతున్న సంగతి తెలిసిందే. సముద్రంలో కాలుష్యం పెరిగిపోవడం.. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వల్ల ఇలా మృత్యువాత పడుతుంటాయని ఇక్కడ మత్స్యకారులు చెబుతున్నారు.

నేడు డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొనదలిచే వారు 1800 4250 0009 టోల్ ఫ్రీ నెంబరుకు ఉదయం 10 నుంచి 11 గంటల్లోపు ఫోన్ చేసి తమ సమస్యలు తెలపవచ్చు. అలాగే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలు నేరుగా మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు ఫిర్యాదు చేయవచ్చు.

గిరి గ్రామాలకు 'మార్గం' సుగమం

- తీరనున్న రహదారి కష్టాలు
- 11 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణం
- రూ.8 కోట్లు మంజూరు
- త్వరలోనే పనులు ప్రారంభం

గిరిజన గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాలకు రహదారి కష్టాలు తీరనున్నాయి. నక్కపల్లి–కోటవురట్ల మండలాలను అనుసంధానం చేస్తూ గిరిజనుల రాకపోకలకు అనువైన రహదారి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.8 కోట్లు విడుదల చేయడంతో సుమారు 11 కిలోమీటర్ల మేర తారు రోడ్డు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.



ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు చెబుతూ హర్షం వ్యక్తం చేస్తున్న ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు

నక్కపల్లి : మండలంలో సీతంపాలెం నుంచి రేబాక తిరుపతిపాలెం మీదుగా కోటవురట్ల మండలం అల్లుమియ్యాపాలెం వరకు మట్టి రోడ్డు ఉంది. నక్కపల్లి మండల ప్రజలు కోటవురట్ల, నర్సీపట్నం వెళ్లాలంటే సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. రేబాక నుంచి ఉద్దండపురం వచ్చి అక్కడ నుంచి అడ్డురోడ్డు మీదుగా కోటవురట్ల వెళ్లాలి. అలాగే సీతంపాలెం ప్రజలు నక్కపల్లి చేరుకుని అడ్డురోడ్డు మీదుగా కోటవురట్ల మండలంలో గ్రామాలకు వెళ్లాల్సి ఉండేది. అనేక వ్యయప్రయాసలు పడి రాకపోకలు సాగించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. సీతంపాలెం నుంచి రేబాక తిరుపతిపాలెం మీదుగా అల్లుమియ్యాపాలెం గిరిజన గ్రామం వరకు 11.6 కిలోమీటర్ల దూరం కలిగిన తారు రోడ్డు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లు నాబార్డు నిధులు విడుదల చేసింది. రోడ్డు నిర్మాణానికి సంబంధించి సర్వే ఏయే ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టాలనే దానిపై ఇంజినీరింగ్ అధికారులు సర్వేలు నిర్వహించి రూట్ మ్యాప్ సిద్ధం చేసారు. నాబార్డు నుంచి నిధులు విడుదల కావడంతో త్వరలోనే రోడ్డు నిర్మాణపు పనులు ప్రారంభం కానున్నాయి. రేబాక తిరుపతిపాలెం, రేవళ్లు గ్రామాలకు చెందిన గిరిజనులు కొత్తగా నిర్మించే తారురోడ్డు మీదుగా అల్లుమియ్యాపాలెం అక్కడ నుంచి కోటవురట్ల నర్సీపట్నం దగ్గర మార్గంలో ప్రయాణించవచ్చు. రోడ్డు వల్ల సమయం, డబ్బులు కూడా ఆదా చేసుకోవచ్చని ఆయా గ్రామాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ రహదారికి ఆనుకుని ఉన్న పొలాల్లోకి, మామిడి, జీడితోటలకు వెళ్లే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, మామిడి, జీడి వంటి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు ఎంతో అనువుగా ఉంటుందని, రైతులకు సైతం రోడ్డు నిర్మాణం వల్ల ఖర్చులు, పెట్టుబడుల ఆదా చేసుకోవచ్చని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ ఉద్యానవన పంటలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసుకునేందుకు చాలా ఉపయోగంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ రోడ్డు నిర్మాణం కోసం తామంతా ఎదురు చూస్తున్నామని ఇన్నాళ్లకు జగనన్న ప్రభుత్వం దయ వల్ల రోడ్డు మంజూరయిందని రేబాక, సీతం పాలెం గ్రామాల సర్పంచ్‌లు సాదిరెడ్డి శ్రీను, గొర్ల నాగ అప్పలరాజు, ఎంపిటీసీలు గొర్ల గోవిందరాజు, వెల్లంకి కాసు బాబు తదితరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేసేందుకు కృషి చేసిన ఎంపీలు వై.వి.సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, డాక్టర్ సత్యవతి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులకు లబ్ధి పొందే గ్రామాల తరపున కృతజ్ఞతలు తెలుపుకొంటున్నామన్నారు. ఈ విషయంపై నాబార్డు ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 11 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.8 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు.

ఆర్టీసీ సమ్మర్ ఆఫర్!

- దూర ప్రాంతాలకు రాను పోను టికెట్లపై రాయితీ
- ముందస్తు రిజర్వేషన్‌తో చార్జీలో 10 శాతం తగ్గింపు
- గతంలో ఒకవైపు ప్రయాణానికే ఈ సబ్సిడీ
- వేసవి ముగిసే వరకు ఈ సదుపాయం వర్తింపు



ఆర్టీసీ బస్సులు

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీ ఈ వేసవిలో ప్రయాణికులకు ఊరటనిచ్చే ఆఫర్ ఇస్తోంది. దూర ప్రాంతాలకు వెళ్లే వారికి రాను పోను ప్రయాణ టికెట్లపై రాయితీని ప్రకటించింది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి, అటు నుంచి తిరిగి రావడానికి ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే వారికి ఈ వెసులుబాటు కల్పించింది. గతంలో రాను పోను ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తే తిరుగు ప్రయాణం టికెట్ చార్జీలో 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడు అలా కాకుండా రెండు వైపులా చార్జీలో 10 శాతం తగ్గింపు ఉంటుంది. ఉదాహరణకు విశాఖపట్నం నుంచి రాజమండ్రికి సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ.400 ఉందనుకుంటే ఇటు నుంచి టికెట్‌లో 10 శాతం, అటు నుంచి టికెట్ చార్జీలో మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. ఈ లెక్కన రెండు వైపులా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే రూ.80 (రూ.40+40) రాయితీ పొందుతారు. సాధారణంగా వేసవి సీజనులో ప్రయాణాలు అధికంగా ఉంటాయి. విద్యార్థులకు సమ్మర్ సెలవులతోపాటు పెళ్లిళ్ల సీజను కూడా కావడంతో దూరప్రాంతాలకు ప్రయాణించే వారు పెద్ద సంఖ్యలో ఉంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను సమకూరుస్తుంటారు. ఈసారి వేసవిలో రాను పోను రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికుల కోసం ఆర్టీసీ రాయితీ వెసులుబాటును కల్పించింది. ఇది ప్రయాణికులకు ఒకింత ఉపశమనం కలిగించనుంది. వేసవి ముగిసే దాకా ఈ సదుపాయం కొనసాగనుంది. రైలులో ప్రయాణించేవారు తమ గమ్యస్థానాలకు వెళ్లి రావడానికి ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. ఇప్పుడు ఆర్టీసీలోనూ అదే తరహా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. అయితే రైల్వేలో రాను పోను రిజర్వేషన్ చేయించుకున్నా టికెట్ చార్జీలో ఎలాంటి తగ్గింపు ఉండదు. కానీ ఆర్టీసీలో 10 శాతం రాయితీ ఇస్తుండడం విశేషం! ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు కోరారు.

రేపటి నుంచి రంజాన్ దీక్షలు

కశింకోట: మండల కేంద్రంలో ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ దీక్షలు చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. చంద్రుడు కనిపించిన మరుసటి రోజు నుంచి దీక్షలు చేపట్టనున్నారు. సోమవారం చంద్రుడు దర్శనమివ్వనున్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి రంజాన్ మాసంలో నిష్ఠగా ఆనవాయితీగా దీక్షలు చేయనున్నారు.

స్థానిక జామియా మసీదు, నూరి మసీదుల్లో దీక్షలు రోజూ ఉదయం చేపట్టి సాయంత్రం విరమించడానికి సన్నద్ధమవుతున్నట్లు ఆయా మసీదు కమిటీల నిర్వాహకులు తెలిపారు.



విశాఖలో ఐకాన్ స్టార్

గోపాలపట్నం: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాకతో విశాఖ విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం సందడి నెలకొంది. షూటింగ్ కోసం విశాఖ వచ్చిన అభిమాన నటుడిని చూసేందుకు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఐకాన్ స్టార్.. పుష్ప.. అంటూ నినాదాలు చేశారు. హైదరాబాద్ నుంచి విమానంలో వచ్చిన ఆయన రోడ్డు మార్గంలో నగరంలోని ఓ హోటల్‌కి వెళ్లారు.

గురుకుల ప్రవేశ పరీక్షలు ప్రశాంతం



ప్రవేశ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

చీడికాడ : మండలంలోని కోనాం డా.బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురుకుల పాఠశాలల 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఈసీసీ కెమెరాల నడుమ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5లో ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 362 మంది హాజరు కావల్సి ఉండగా 53 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు 169 మందికి 13 మంది గైర్హాజరైనట్టు ప్రిన్సిపాల్ సిహెచ్. హిమాచల తెలిపారు.

కల్యాణపులోవ ఆదాయం రూ. 16.47 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది



బ్రహ్మముడులు వేయించుకుని పుణ్యస్నానమాచరిస్తున్న దంపతులు

రావికమతం : కల్యాణపులోవ తిరుణాళ్లు ఆదివారంతో ముగిసాయి. ఈ నెల 8,9,10 తేదీల్లో తిరునాళ్లు జరిగిన సంగతి తెలిసిందే. 8వ తేదీన 90 వేల మంది హాజరు కాగా 9న రెండు లక్షలు, 10వ తేదీన 30 వేల మంది యాత్రికులు తరలి వచ్చినట్లు ఆలయ ఈవో కిరణ్మయి తెలిపారు. మూడో రోజు భక్తులు, దంపతులు వేద పండితులచే బ్రహ్మముడులు వేయించుకుని స్నానమాచరించారన్నారు. భక్తుల ద్వారా ఈ ఏడాది రూ.16,47,081 ఆదాయం సమకూరినట్టు తెలిపారు. హుండీల ద్వారా రూ.8,29,716, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, ప్రసాదం ద్వారా రూ.4,41,530, దర్శనం టికెట్ల ద్వారా రూ.3,75,835 ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది రూ.14,27,901 ఆదాయం రాగా ఈ ఏడాది రెండు లక్షల వరకూ పెరిగిందన్నారు. ఉత్సవ పర్యవేక్షకుడు, సర్పంచ్ వంజరి గంగరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ పర్యవేక్షణలో 40 మంది శ్రీవారి భక్తులు హుండీలు లెక్కించారు. అలాగే హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని కొత్తకోట బ్యాంకులో స్వామి వారి ఖాతాలో జమ చేసినట్టు ఈవో తెలిపారు.

76 దేవాలయాలకు రూ. 7.6 కోట్లు మంజూరు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం : జిల్లాలో 76 దేవాలయాలు నిర్మాణానికి రూ.7.60 కోట్లు నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదివారం చెప్పారు. తిరుమల, తిరుపతి దేవస్థానం నుంచి ఒక్కో దేవాలయానికి రూ.10లక్షలు చొప్పున ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో చేపట్టబోయే పనులు దేవదాయ, ధర్మదాయశాఖ పర్యవేక్షణలో జరుగుతాయని ధర్మశ్రీ చెప్పారు. టీటీడీ చేపట్టిన హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ దేవాలయాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. వీటిలో చోడవరం నియోజకవర్గంలోనే 16 దేవాలయాలకు రూ.కోటి 60లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. చోడవరం మండలంలో షిర్డిసాయిబాబా ఆలయం (నర్సయ్యపేట), ముత్యాలమాంబ ఆలయం (జి.జగన్నాథపురం), రామాలయం (గోవాడ బీసీకాలనీ), శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయం (చోడవరం) నిధులు మంజూరయ్యాయన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో చిట్టియ్యపాలెం, మల్లాం బీసీ కాలనీ ల్లో రామాలయాలు, రావికమతం మండలంలో గుడ్డిప, ఎల్.పొన్నవోలు, రోలుగుంట మండలంలో కె.నాయుడుపాలెం, వెదుల్ల వలస, వడ్డిప, జె.నాయుడుపాలెం, శరభవరం, అంట్లపాలెం, రోలుగుంట గ్రామాల్లో నూతనంగా రామాలయాలు నిర్మాణానికి నిధులు వచ్చాయన్నారు. త్వరలోనే నిర్మాణాలు చేపడతారని ధర్మశ్రీ చెప్పారు.

• జలకాలాటలలో...


నరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఎత్తయిన రెండు కొండల మధ్యలో నుంచి ప్రవహించే నీటిలో జలకాలాడేందుకు సందర్శకులు పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లా నలుమూలలు నుంచి ప్రత్యేక వాహనాల్లో అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో కోలాహలం నెలకొంది. తాండవ ప్రాజెక్టుపై కూడా సందర్శకుల హడావుడి కన్పించింది.

- నాతవరం



అభివృద్ధి పనుల పండగ

- రూ 93.52 కోట్లతో పెద్దేరు ఆధునికీకరణ, 4ఎల్ కాలువ పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శంకుస్థాపనలు
- 5 గ్రామాల్లో రూ.2.92 కోట్లతో మంచినీటి పథకానికి ప్రారంభోత్సవం
- రూ.14 లక్షలతో అంగన్‌వాడీ భవనం ప్రారంభం



పెద్దేరు జలాశయం ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వి.జె.పురంలో అంగన్‌వాడీ కేంద్రం భవనానికి చిన్నారితో రిబ్బన్ కట్ చేయించి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

మాడుగుల : మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయం (తెన్నేటి విశ్వనాథం) ఆధునికీకరణ పనులకు రూ.84.40 కోట్లు మంజూరు కావడంతో ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు జేడీపేట, ఎల్.పొన్నవోలు మూడు రోడ్ల కూడలి వద్ద శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ పనులు పూర్తి కాగానే పెద్దేరు ఆయకట్టు 19,968 ఎకరాలకు సాగు నీరు అందనుంది. ఎల్.గదబవీధి గ్రామం వద్ద ఎనిమిది గిరి గ్రామాలకు 848 ఎకరాల మెట్టు సాగుకు పెద్దేరు జలాశయం నుంచి సాగు నీరందించడానికి రూ.9.12 కోట్లు మంజూరు కావడంతో శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎల్.పొన్నవోలు పంచాయతీలో ఒంటిమామిడిపాలెంలో జల్‌జీవన్‌మిషన్‌లో భాగంగా రూ.25 లక్షలతో నిర్మాణం చేపట్టిన ఇంటికి కుళాయిలతో పాటు 20 వేల లీటర్ల సామర్థ్యం గల మంచి నీటి పథకం ప్రారంభించారు. ఎల్.పొన్నవోలులో రూ.55 లక్షలతో ఇంటికి కుళాయిలతో పాటు 20 వేలు లీటర్ల సామర్థ్యంగల మంచినీటి పథకం ప్రారంభించారు. కింతలి వల్లాపురంలో రూ.1.04 కోట్లుతో ఇంటింటికీ కుళాయిలతో 60వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి పథకం నిర్మాణం జరగడంతో పనులు ప్రారంభించారు. ఒమ్మలి జగన్నాథపురంలో రూ.30 లక్షలతో జరిగిన 40 వేల లీటర్ల సామర్థ్యం గల మంచి నీటి పథకం ప్రారంభించారు. సాగరంలో రూ.78 లక్షలతో నిర్మాణం జరిగిన ఇంటింటికీ కుళాయిలతో పాటు 40వేల లీటర్ల సామర్థ్యం గల మంచి నీటి పథకం ప్రారంభించి శిలాఫలకాలు అవిష్కరించారు.

స్కూల్లో బువ్వ....జగన్ మావయ్య

అంగన్‌వాడీ కేంద్రంలో మీకు పాలు గుడ్లు, ఆకు కూరలతో కూడిన అన్నం ఎవరు అందిస్తున్నారు.. అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఓ చిన్నారిని ప్రశ్నించడంతో..ఆ చిన్నారి జగన్ మామయ్య అని...వచ్చీ రాని మాటలతో బదులిచ్చింది...అంతేకాకుండా అక్షరాలు వర్ణమాలతో పాటు రైమ్స్ తడబడకుండా పలకడంతో ఆయన అభినందించారు. ఒమ్మలి జగన్నాథపురం గ్రామంలో రూ.14 లక్షలతో నిర్మాణం జరిగిన అంగన్‌వాడీ భవనాన్ని అంగన్‌వాడీ చిన్నారిని ఎత్తుకుని రిబ్బన్ కట్ చేయించి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. అనంతం చిన్నారులతో కొంతసేపు ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, మండల పార్టీ అధ్యక్షుడు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ కొండలరావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్‌లు, గొళ్లవిల్లి సంజీవరావు, వేగేశ్న ప్రభాకరరాజు. కొసిరెడ్డి కృష్ణమూర్తి, తాళ్ళపురెడ్డి రాంబాబు రాంబాయి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డపు భాస్కరరావు, ఎంపీటీసీలు తలారి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శేనాపతి గంగాధర్, గొళ్లవిల్లి రాజేష్, పడాల అప్పలనాయుడు, కె.శ్రీరామ్మూర్తి, కె.రాము, జనపరెడ్డి అప్పారావు, శనివాడ, వెంకటరమణ, పాము వెంకటరావు, నీటి పారుదల శాఖ డీఈ చిన్నం నాయుడు, ఇంజినీర్‌లు సత్యంనాయుడు, జేఈలు భార్గవ కుమార్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధారమఠం హుండీ ఆదాయం రూ.3.14 లక్షలు



వివరాలు వెల్లడిస్తున్న ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు

గొలుగొండ : ప్రముఖ శైవక్షేత్రమైన దారమఠం శివాలయానికి మహా శివరాత్రి సందర్భంగా రూ. 3 లక్షల 14 వేల ఆదాయం వచ్చిందని ఆలయ అధికారి వెంకటాద్రి తెలిపారు. ఆదివారం హుండీ లెక్కింపు నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. హుండీ, టికెట్లు, తలనీనాల ఆదాయం ఈ ఏడాది రూ. 3.14 లక్షలు వచ్చిందని, దీంట్లో రూ. లక్ష వరకు విద్యుత్ అలంకరణ, ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సత్యనారాయణ, జక్కు శ్రీనివాస రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలో అధిష్టింపజేసి యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

భక్తి విశేషం.. వినూత్న సంప్రదాయం

- రాజయ్యపేటలో భక్తిశ్రద్ధలతో నూకతాత పండగ
- రోడ్డుపై పడుకుని మొక్కు చెల్లించుకున్న భక్తులు



నూకతాత విగ్రహాన్ని నెత్తిన పెట్టుకుని ఆశీస్సులు తీసుకుంటున్న సమన్వయకర్త కంబాల జోగులు



మొక్కు చెల్లించుకునేందుకు రోడ్డుపై పడుకున్న గంగపుత్రులు

నక్కపల్లి : వింత ఆచారం, వినూత్న సంప్రదాయంతో ఆసక్తి కలిగించే నూకతాత పండగను ఆదివారం మత్స్యకారులు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. మత్స్యకారులు అధికంగా ఉండే రాజయ్యపేటలో ఈ పండగను తరతరాలుగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా మహాశివరాత్రి అమావాస్య మరుసటిరోజు రాజయ్యపేటలో ఈ నూకతాత పండగ జరుగుతుంది. నూకతాతను గంగపుత్రులు తమ కులదైవంగా, ఆరాధ్య దైవంగా భావిస్తారు. పండగ సందర్భంగా దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా రాజయ్యపేట చేరుకున్నారు. బంధువులు, స్నేహితుల రాకతో గంగపుత్రుల ఇళ్లన్నీ కళకళలాడాయి. ఆదివారం నూకతాత విగ్రహాలను సముద్రస్నానానికి తీసుకెళ్లారు. తిరిగి ఆలయానికి విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో భక్తులు రోడ్డుపై పడుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇలా రోడ్డుపై పడుకున్న భక్తులపై నుంచి విగ్రహాలను చేతపట్టిన పూజారులు దాటుకుంటూ వెళ్లారు. ఇలా మొక్కు చెల్లించుకుంటే నూకతాత అనుగ్రహం తమపై ఎల్లవేళలా ఉంటుందని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని గంగపుత్రుల నమ్మకం. నూకతాత పండుగలో కోళ్లు, మేకలు బలి ఇవ్వడం నిషేధం. రక్తం చిందించడాన్ని నూకతాత ఒప్పుకోడని మత్స్యకారులు చెబుతారు. పండుగను పురస్కరించుకుని గ్రామంలో పెద్ద తిరునాళ్లు జరిగింది. భారీ విద్యుదలంకరణలు ఏర్పాటు చేశారు. బాణా సంచాల సంబరాలు మిన్నంటాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. నూకతాత ఆలయాన్ని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి దర్శించుకున్నారు. కంబాల జోగులు నూకతాత విగ్రహాలను నెత్తిన పెట్టుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు ఎరిపల్లి నాగేశు, యలమంచిలి తాతబాబు, సూరాకాసుల గోవిందు, బొల్లంబాబ్జి, గొర్ల బాబూరావు, శేషారత్నం పాల్గొన్నారు.

కోటారావుకు ఘన సత్కారం



కాకినాడలో కోటారావును సత్కరిస్తున్న అతిథులు

అనకాపల్లి : రాష్ట్ర పద్య కవితా సదస్సు అధ్యక్షుడు కొట్టే కోటారావు (అనకాపల్లి)కి ఘన సన్మానం జరిగింది. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అఖిల భారత సాహితీ సదస్సు కాకినాడలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కోటారావును దుశ్శాలువ కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు సమక్షంలో జరిగిన సభలో పద్మ భూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వంగూరి చిట్టెన్ రాజు, కడిమెళ్ల వరప్రసాద్ తదితరులు కోటారావుకు సత్కారం చేశారు. సెలవు పెట్టకుండా కోటారావు ఉత్తమ అధ్యాపకునిగా అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో పని చేసి విశేష సేవలందించారని ప్రస్తుతించారు. సాహితీ వేత్తలైన పాటల రచయిత భువన చంద్ర, మండలి బుద్ధ ప్రసాద్, శలాక రఘునాథశర్మ, డాక్టర్ వెలమల సిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన బాలు

గొలుగొండ: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అల్లూరి జిల్లా జి. మాడుగుల మండలం కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన సాయితో పాటు బాలు అనే యువకుడు బైక్‌పై సొంత గ్రామం వెళ్తున్న సమయంలో గొలుగొండ మండలం రావణాపల్లి వద్ద ఆర్టీసీ బస్ ఢీకొన్న ఘటనలో బాలు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడు సాయికి తీవ్ర గాయాలయ్యాయి. చింతపల్లి నుండి నర్సీపట్నం వస్తున్న ఆర్టీసీ బస్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరు..

మాకవరపాలెం : మండలంలోని తాడపాలకు చెందిన కలాం అప్పారావు (34) శనివారం రాత్రి సమీప గ్రామమైన మామిడిపాలెంలో జరిగిన పండగకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. ప్రమాదవశాత్తూ బైక్ బోల్తా కొట్టడంతో అప్పారావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే నర్సీపట్నం ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

శేషుకొండ కాలనీలో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో చిందర వందరగా పడిన దుస్తులు

యలమంచిలి రూరల్ : పట్టణానికి సమీపంలో శేషుకొండ కాలనీలో కిరాణా దుకాణంలో పని చేసే కశింకోట శంకర్రావు ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. కుటుంబ సభ్యులంతా ఇంటి ముందు ఉండగానే వారికి తెలిసిన యువకుడు ఇంట్లోకి చొరబడి రూ. 20 వేల నగదు అపహరించుకుపోయాడు. బీరువా పగులగొట్టేందుకు యత్నించేలోగా శబ్దాలు విని కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్తుండగా సుమారు 16 నుంచి 17 సంవత్సరాల వయసున్న యువకుడు ఇంట్లోంచి బయటికి వచ్చి ఒక్కసారిగా పరారయ్యాడు. అతని కోసం ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

చూస్తుండగానే యువకుడు తమ కళ్లు గప్పి ఇంట్లో నగదు దొంగలించుకుపోయాడని, బీరువాలో సీక్రెట్ లాకర్ తెరిచేలోగా తాము ఇంట్లోకి రావడం చూసిన యువకుడు పరారయ్యాడని తెలిపారు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

శివరాత్రి ప్రత్యేక బస్సుల ద్వారా రూ. 5.80 లక్షల ఆదాయం

అనకాపల్లి : మహా శివరాత్రిని పురస్కరించుకుని అనకాపల్లి ఆర్టీసీ డిపో రూ.5.80 లక్షల ఆదాయం సమకూర్చుకుందని డిపో మేనేజర్ ఎస్.సుజాత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి నుంచి కల్యాణపులోవకు 32 బస్‌ల ద్వారా రూ. 4 లక్షల 70 వేలు, అనకాపల్లి నుంచి పుణ్యగిరికి (ఎస్.కోట) 6 బస్‌ల ద్వారా రూ.లక్ష 10 వేల ఆదాయం వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలు, తీర్థయాత్రలకు ప్రత్యేక బస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బీరకాయ ఆకారంలో గుమ్మడి



ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఒక కూరగాయల దుకాణం వద్ద బీరకాయ ఆకారంలో పొడవుగా ఉన్న గుమ్మడికాయను చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. ఈ గుమ్మడికాయ రెండు అడుగుల పొడవు ఉంది. ఈ విచిత్ర గుమ్మడికాయకు చాలా మంది ఫొటోలు తీసి ఫేస్‌బుక్, వాట్సప్‌లలో అప్‌లోడ్ చేశారు.

క్యాబ్ డ్రైవర్‌ది హత్యా? ఆత్మహత్యా?



సంఘటనా స్థలంలో కారు



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం, ఏసీపీ రాంబాబు

- కలకలం రేపిన కాలిన మృతదేహం
- ఎండాడలో ఘటన
- మృతుడిది జగ్గన్నపేట

కొమ్మాది: ఎండాడలో సగం కాలిన ఓ క్యాబ్ డ్రైవర్ మృతదేహం కలకలం రేపింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఎండాడలోని సెయింట్ లుక్స్ కళాశాలకు సమీపంలో సగం కాలిన మృతదేహాన్ని ఆదివారం వాకర్లు గుర్తించి.. ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఆ మృతదేహం ఎంవీపీకాలనీలో నివాసం ఉంటున్న మోసగంటి సుబ్రహ్మణ్యం(42)దిగా గుర్తించారు. ఆయన క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. సుబ్రహ్మణ్యంకు 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరి సొంతూరు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం జగ్గన్నపేట. కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య తగాదాల కారణంగా మూడేళ్ల కిందట విడాకులు తీసుకున్నారు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. అప్పటి నుంచి సుబ్రహ్మణ్యం ఒంటరిగానే ఎంవీపీలో నివాసం ఉంటూ.. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా.. శనివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో జీవితంపై విరక్తి చెందుతున్నట్లు, బాధతో కొన్ని స్లోగన్స్‌ను తన వాట్సాప్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడు. తెల్లవారేసరికి విగతజీవిగా మారాడని అతని సోదరుడు ప్రకాష్ విలపించారు.



మోసగంటి సుబ్రహ్మణ్యం (ఫైల్)

అనుమానాలెన్నో..

గతంలో సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో చేతులు కోసుకున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఒంటరిగా బతకలేక పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా హత్య చేసి కాల్చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సుబ్రహ్మణ్యం చనిపోయిన స్థలంలో రెండు మద్యం బాటిల్స్, అతని కాలిపై గాయాలున్నాయి. సంఘటన స్థలంలోనే కారు ఉంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ రాంబాబు, ఆరిలోవ సీఐ గోవిందరావు సుబ్రహ్మణ్యం మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని.. ఇప్పటికే క్లూస్ టీమ్ వివరాలు సేకరించిందన్నారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ మెగా మేళా



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ఆరోగ్య సమస్యలు, ఆపదలో ఉన్న వారికి ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.5 కోట్లకు పైగా ఆర్థిక సహకారం అందజేసామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రూ.50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. రూ.1000 పైబడిన వైద్యాన్ని ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే వెసులబాటు కల్పించారన్నారు. విద్య, వైద్యం పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ లబ్ధి చేకూరని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో నేటి వరకు రూ.5 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు బేతిరెడ్డి రత్నం, వీరమాచినేని జగదీశ్వరి, ఎంపీలు రుత్తల సత్యనారాయణ, గజ్జలపు మణికుమారి, నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లెక్కల సత్యనారాయణ, లగుడు నాగేశ్వరరావు, రుత్తల శ్రీనువాసు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన 50 మంది ఆటో డ్రైవర్లు



ఆటో డ్రైవర్లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు కనకదుర్గ ఆటో యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. తమ యూనియన్‌తో పాటు తగరంపూడి, సీతానగరం, వెంకుపాలెం, మెట్టపాలెం గ్రామాలకు చెందిన 50 మంది ఆటోడ్రైవర్లు పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నారన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ స్వగృహంలో ఆదివారం యూనియన్ సభ్యులకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు చేసే సీఎం జగన్‌మోహన్‌రెడ్డే సామాజిక న్యాయం, కులమతాలకు అతీతంగా పని చేస్తారన్నారు. అటువంటి ప్రజా నాయకుడిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కిశోర్, పలు ఆటో యూనియన్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 4 టీడీపీ కుటుంబాలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల : మండలంలో చింతలూరు గ్రామానికి చెందిన నేమాల తాతారావు, మెలిపాక కోటేశ్వరరావు, మెలిపాక నాగశివ, ఎత్తుల పెంటయ్యకు చెందిన నాలుగు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం జేడీపేట గ్రామానికి స్వచ్ఛందంగా వచ్చి సర్పంచ్ కాళింగ శకుంతల కళ్యాణరాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామస్తుల అందుబాటులో ఉంటూ అందిస్తున్న సేవలను నమ్మి వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు నాగశివ, పెంటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్‌సీపీ నాయకులు దారా మల్లేశ్వరి చిన్ని, బోర చిన్న, గూడెపు హరికృష్ణ, కాతరమణ, కాళ్ల రాము, విస్సారపు రామారావు, పర్రే రామునాయుడు, యలమంచిలి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ ధ్రువపత్రం సృష్టించిన వారిపై ఫిర్యాదు



ధ్రువ పత్రం

Panchayat Secretary

ఫోర్జరీ సంతకాలతో సృష్టించిన ధ్రువపత్రం

మాకవరపాలెం: ఫోర్జరీ ధ్రువపత్రం సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని జి.కోడూరు వీఆర్వో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రాజారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జి.కోడూరు గ్రామానికి చెందిన సేనాపతి జ్యోత్స్న ఫోర్జరీ ధ్రువపత్రం సృష్టించినట్టు వారు గుర్తించారు. పాపయ్యపాలెంలో ఇటువంటి పేరుతోనే మరొకరు ఉండడంతో అసలు విషయం బయటపడినట్లు వారు తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న వీఆర్వో శ్రీనివాసరావు, కార్యదర్శి రాజారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ కంఠంలో ఉన్న ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఈ ధ్రువపత్రాలను వీఆర్వో, కార్యదర్శి సంయుక్తంగా జారీ చేస్తారు. కానీ జి.కోడూరులో వారి ప్రమేయం లేకుండా స్టాంపులు తయారు చేయించి, ఫోర్జరీ సంతకాలతో సేనాపతి జ్యోత్స్న పేరుతో ధ్రువపత్రం సృష్టించారు. ఈ నేపథ్యంలో దీనిని సృష్టించిన వారిపై విచారణ చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో పేదలకు 25శాతం ఉచిత సీట్లు

- డీఈవో బ్రహ్మాజీరావు
- ఒకటో తరగతిలో ప్రవేశాలకు షెడ్యూల్

సాక్షి,పాడేరు: విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించనున్నామని డీఈవో బ్రహ్మాజీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటోవ తరగతిలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైందని పేర్కొన్నారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్సీ,స్టేట్‌సిలబస్ అమలవుతున్న ప్రైవేట్,ఎయిడెడ్,కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు పేద పిల్లలకు ఉచితంగా కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈనెల 25వరకు గడువు పొడిగించిందని పేర్కొన్నారు. హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం,ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, వెనుకబడిన సమూహాలు(బీసీ,మైనార్టీ, ఓసీ)లకు 6శాతం సీట్లు కేటాయించినట్టు తెలిపారు. రూరల్ ఏరియాలో సంవత్సర ఆదాయం రూ.1.20 లక్షలు, అర్బన్ ఏరియాలో రూ.1.44లక్షల ఆదాయానికి లోబడిన కుటుంబాల విద్యార్థులు ఈ ఉచిత సీట్లకు అర్హులు. cre.ap.gov.inవెబ్‌సైట్‌లో విద్యార్థులు వివరాలను నమోదు చేయాలి. దరఖాస్తు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రుల గుర్తింపు కార్డులు జతచేయాలి. ఏప్రిల్ ఒకటోవ తేదీన లాటరీ ద్వారా అర్హులైన విద్యార్థుల తొలిజాబితా విడుదల చేస్తామని, ఏప్రిల్ 2నుంచి 10వతేదీ వరకు అడ్మిషన్లను ఫైనల్ చేసి, ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండవ లిస్టును ప్రకటిస్తామని డీఈవో తెలిపారు.ఏప్రిల్ 16నుంచి 23వతేదీ వరకు ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఖరారు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో తమ పిల్లల పేర్లను నమోదు చేసి,నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయం సీఎంవో ప్రకాష్ (ఫోన్ నంబర్ 8985646737)ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

బాలికల పాఠశాలల్లో నిఘా నేత్రం

- 49 బాలికల పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- 17 వేల మంది బాలికల భద్రతకు భరోసా
- ఒక్కో పాఠశాలలో పది కెమెరాల ఏర్పాటు



కంప్యూటర్‌లో సీసీ కెమెరా దృశ్యాలు చూపుతున్న హెచ్‌ఎం గోపాలం

కొయ్యూరు: బాలికల పాఠశాలల్లో సీసీ కెమేరాలను ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బాలికల ప్రత్యేక రక్షణను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేసింది. ఒక్కో పాఠశాలలో పది సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రహరీ వద్ద, ప్రధాన గేటు, పాఠశాల ఆవరణలో, కారిడార్ ఇతరత్రా ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను మెయిన్ నెట్‌వర్క్ ద్వారా కంప్యూటర్‌కు అనుసంధానం చేస్తారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలన్నీ కంప్యూటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తారు. పాఠశాలల్లో బాలికల రక్షణ, భద్రతకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రక్రియ పూర్తయింది

బాలికల పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది.దీంతో బాలికలకు మరింత భద్రత పెరగనుంది. పాఠశాలల్లో బాలికల భద్రతపై పూర్తి నిఘా ఉంటుంది. పాఠశాలలో బయట వ్యక్తుల ప్రవేశం లేకుండా వీలు కలుగుతుంది.

– కొండలరావు, డీడీ, గిరిజన సంక్షేమ శాఖ, పాడేరు

క్లుప్తంగా

సోహం ఆశ్రమంలో ఆధ్యాత్మిక శోభ

అనకాపల్లి: మండలంలో బట్లపూడి సోహం ఆశ్రమంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మాఘమాసం ఆఖరిరోజు అమావాస్య రావడంతో ప్రదోష సమయంలో పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు సోహం రవి తెలిపారు.

ఘనంగా పోతురాజుబాబు ఉత్సవం



తీడలో పోతురాజుబాబును దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: తీడ గ్రామంలో కల్యాణం పోతురాజుబాబు ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కర్ర గుర్రాలు, ఏనుగులపై ఊరేగింపు నిర్వహించారు. గ్రామం నుంచి ఆలయం వరకు సాగిన ఈ ఊరేగింపు తర్వాత ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిశోర్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ప్రాంగణంలో తీర్థ మహోత్సవం జరిగింది. మహిళల అలంకరణ వస్తువులు, ఆట వస్తువులు, తినుబండారాల అమ్మకాలు జోరుగా సాగాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా వచ్చి పాల్గొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో 380 మందికి నేత్ర పరీక్షలు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 380 మందికి ఆప్తాలమిస్టులు కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన 122వ కంటి వైద్య శిబిరంలో 237 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 95 మందికి ఉచితంగా మందులు అందజేశారు. 30 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. బ్రాండిక్స్‌లో నిర్వహించిన శిబిరానికి విచ్చేసిన వారిని బ్రాండెక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరామర్శించారు. శిబిరానికి విచ్చేసిన కంటి బాధితులకు మజ్జిగ, ఫలహారం, భోజన సదుపాయాలు కల్పించారు.

ధారమఠం శివుడికి ప్రత్యేక పూజలు

గొలుగొండ: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం భక్తులు ధారమఠం మహా శివుడిని దర్శించుకున్నారు. జలపాతాల వద్ద స్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. అలాగే కుటుంబ సమేతంగా వచ్చిన వారు అక్కడే వంటా వార్పు చేసుకున్నారు.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:రాజా
గామి	:సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	:సత్యనారాయణస్క్రీన్-2
రాజుగారి అమ్మాయి, నాయుడుగారి అబ్బాయి	: షిర్డీసాయి
ఊరు పేరు భైరవకోన	:పర్తిసాయి
ఆపరేషన్ వాలెంటైన్	:వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	:శ్రీసత్య
భీమా	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-43 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 246 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 221 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

దేవభాష.. ఆమె శ్వాస!

- ఆరు పదుల వయసులో సంస్కృత అభ్యసన
- కన్నూరుపాలెంలో శిక్షణ కేంద్రం ఏర్పాటు
- ఉచితంగా నేర్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయిని సత్యగాయత్రీదేవి



సంస్కృతం బోధిస్తున్న దువ్వూరి సత్యగాయత్రీదేవి

కశింకోట: అవసాన దశలో ఇతరుల్లా కాలక్షేపం చేయాలనుకోలేదు. తనకు నచ్చిన దేవ భాషను నేర్చుకున్నారు. దాన్ని బతికించాలని తపన పడ్డారు. ఇందుకోసం ఒక శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పి చిన్నారులు మొదలుకొని పెద్దల వరకు ఉచితంగా నేర్పిస్తున్నారు. వారికి భాషపై అవగాహన కల్పిస్తూ పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. ఆమే దువ్వూరి సత్య గాయత్రీ దేవి. కశింకోట మండలం కన్నూరుపాలెం గ్రామానికి చెందిన ఆమె ఎంఏ హిందీ, బీఈడీ చదివారు. కరోనా ముందు వరకు మాకవరపాలెంలోని ఒక ప్రైవేటు స్కూల్లో స్పెషల్ టీచర్‌గా పని చేసి పదవీ విరమణ పొందారు. 65 ఏళ్ల వయసులో ఖాళీగా ఉండటంతో సంస్కృత భాషపై మక్కువతో కరోనా సమయంలో ఆన్‌లైన్లో నేర్చుకున్నారు. ప్రవేశ, పరిచయ, శిక్ష, కోవిదః ప్రాథమిక స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. సంస్కృతంపై కుతూహలంతో వృద్ధాప్యంలోనూ ఇంకా చదువుతూ 'గీతా సోపానం' స్థాయి పరీక్ష రాయడానికి సన్నద్ధమవుతున్నారు. సంస్కృతంలో అవగాహన కలిగించి గ్రామీణులను విద్యావంతులను చేయడానికి దేశ భాష, దేవ భాష, రాజ భాష అయిన సంస్కృతాన్ని అంతరించిపోకుండా బతికించాలనే సంకల్పంతో స్థానికంగా పిల్లల నుంచి పెద్దల వరకు భాష నేర్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

20 మందికి శిక్షణ

ఆసక్తికొద్దీ స్వతహాగా 'సంస్కృత భారత శిక్షణ కేంద్రం' పేరిట తన ఇంటి వద్ద నెలకొల్పి ఆర్నెల్లుగా శిక్షణ ఇస్తున్నారు. ఏపీ సంస్కృత భారతి ద్వారా సమకూర్చే పుస్తకాలతో ఉచిత బోధన సాగిస్తున్నారు. ఇక్కడ అంగన్‌వాడీ పిల్లలు , ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10 వరకు చదివే బాలబాలికలు, పెద్దలు కూడా సంస్కృతం అభ్యసిస్తుండటం విశేషం. ప్రస్తుతం 20 మంది వరకు సంస్కృతం నేర్చుకుంటున్నారు. వారికి సెలవు దినాలైన శని, ఆది వారాల్లో ఖాళీ సమయం సాయంత్రం పూట రెండు గంటలపాటు శిక్షణ ఇస్తున్నారు. సంస్కృతం భాషను హిందీ, తెలుగు భాషల్లో రాయడం, చదవడం నేర్పిస్తున్నారు.



కన్నూరుపాలెంలోని ఉచిత సంస్కృత భారతి శిక్షణ కేంద్రంలో చిన్నారుల భక్తి గీతాలాపన

పదాలు, వాక్యాలు, మాట్లాడటం, భక్తి గీతాలు తదితర వాటిని నేర్పిస్తున్నారు. ఇక్కడ నేర్చుకున్న 18 మంది విద్యార్థులు ఇటీవల సంస్కృతం సరళ స్థాయి పరీక్ష రాశారు. ఏపీ సంస్కృత భారతి ద్వారా పేపర్లు దిద్ది సర్టిఫికెట్లు అందించనున్నారు. నీటిపారుదల శాఖలో పదవీ విరమణ చేసిన భర్త బాలకృష్ణమూర్తి నాలుగేళ్ల క్రితం కాలం చేశారు. అతని పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న కుమారుడు టి.వి. సందీప్‌తో ఖాళీ సమయంలో సేవా దృక్పథంతో సంస్కృతాన్ని నేర్పిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.

భాష మనుగడకే..

దేవతల భాష, దేశీయ భాష, రాజ భాషగా పేరొందిన సంస్కృతం అంటే నాకెంతో ఆసక్తి. నా అల్లుడు ఎం.జి. నందనరావు తిరుపతి ఎస్వీబీసీ టీవీ చానల్‌లో పురాణ ప్రవచనాలు చేస్తుంటారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సంస్కృత భాషపై అభిలాషతో కరోనా సమయంలో నేర్చుకొని నాకు ఉన్న విజ్ఞానాన్ని ఇతరులకు పంచుతున్నాను. దీనివల్ల గ్రామీణ ప్రాంతంలో సంస్కృతానికి ఆదరణ పెరగనుంది. భాష ఉనికి నిలబడుతుందని ప్రగాఢ విశ్వాసం.

– దువ్వూరి సత్యగాయత్రీదేవి, ప్రైవేటు సంస్కృత ఉపాధ్యాయిని, కన్నూరుపాలెం

శిక్షణ బాగుంది



కన్నూరుపాలెం ప్రభుత్వ హైస్కూలులో ఏడో తరగతి చదువుతున్నాను. సంస్కృతం పట్ల ఆసక్తి కలిగింది. దీంతో నేర్చుకుంటున్నాను. బాగా శిక్షణ ఇస్తుండటంతో ఆనందంగా నేర్చుకుంటున్నాను

– గండి గాయత్రి, కన్నూరుపాలెం

పట్టు సాధించడానికి..



కశింకోటలోని ప్రైవేటు స్కూలులో 9వ తరగతి చదువుతున్నాను. మాకు 8వ తరగతి వరకు సంస్కృత పాఠ్యాంశం ఉండేది. ఇప్పుడు దాని స్థానంలో తెలుగుగాని, హిందీ గాని అభ్యసించాల్సి ఉంది. గతంలో అభ్యసించిన సంస్కృతం మరిచిపోకుండా కొత్త అంశాలు నేర్చుకొని భాషపై పట్టు సాధించడానికి నేర్చుకుంటున్నాను.

–కూండ్రపు అమృత, విద్యార్థి, కన్నూరుపాలెం

ఆసక్తితో నేర్చుకుంటున్నా



కొత్త విషయాలు నేర్చుకోవడం అంటే ఆసక్తి. దీంతో సంస్కృతాన్ని నేర్చుకుంటున్నాను. బీకాం చదివాను. గతంలో వ్యాపారం చేసేవాడ్ని. వయసు 60 ఏళ్లు దాటడటంతో వ్యాపారానికి స్వస్తి పలికాను. ఖాళీగా ఉన్నాను. ఈ నేపథ్యంలో దేవ భాష, దేశీయ భాష సంస్కృతం అభ్యసిస్తున్నాను. భాష నేర్చుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

–ఎస్. శ్రీనివాస్, కన్నూరుపాలెం

సంక్షేమం, అభివృద్ధిని చూసి గెలిపించండి

- బూత్ కమిటీ సమావేశంలో సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



మాట్లాడుతున్న సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల కిట్‌నుఅందజేస్తున్న మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం జరుగుతుందని, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక రింగ్‌రోడ్డు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్ ఆధ్వర్యంలో మండల స్థాయి 93 బూత్ కమిటీల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు మూడు పార్టీలు ఏకమై కుయుక్తులు పన్నుతున్నాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రజలను చైతన్యపరిచి వాటిని తిప్పికొట్టాలన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఒక్కొక్క బూత్ కమిటీకి అధ్యక్షుడు, ముగ్గురు కోర్ కమిటీ సభ్యులు, కోర్ కమిటీ సభ్యులకు ఒక వలంటీర్ ఉండగా, వలంటీర్‌కు ఇద్దరు గృహసారథులు నియమించామన్నారు. అంతకుముందు బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల కిట్లు పంపిణీ చేశారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ సైనికులా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తి దేవాలయంలో అన్నసమారాధన...

స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణమూర్తి దేవస్థానంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రారంభించారు. అంతకుముందు సూర్యనారాయణమూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు భరత్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యనారాయణస్వామి దేవాలయంలో అన్న సమారాధన ప్రారంభిస్తున్న మలసాల భరత్‌కుమార్

సామాజిక సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న మందపాటి సునీత

అనకాపల్లి: మహిళా సాధికారతకు కృషి చేస్తున్న లయన్స్ క్లబ్, స్పందన చేయూత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకిరామరాజులు పేర్కొన్నారు. జీవీఎంసీ 82వ వార్డు గాంధీనగరం లయన్స్ క్లబ్ హాలులో ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా సాధికారత సదస్సులో వారు మాట్లాడారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందడానికి స్పందన చేయూత చేస్తున్న సేవలు శ్లాఘనీయమన్నారు. క్లబ్ విశాఖ క్యాన్సర్, నేత్ర ఆస్పత్రుల ద్వారా రోగులకు సేవలను అందజేస్తోందని చెప్పారు. మూడో విడత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండో బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. శిక్షణలో అభ్యర్థులు కుట్టిన, తయారు చేసిన వస్త్రాల ప్రదర్శనను వారు తిలకించారు. క్లబ్ శాఖ అధ్యక్షుడు వెంకటరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ పూర్వపు గవర్నర్ వీఎస్ నూకరాజు, స్పందన చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఇ.బుచ్చిరాజు, క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ పూసర్ల సునీల్, మహిళా సాధికారత కన్వీనర్ దండు ఝాన్సీ, లక్ష్మి, క్లబ్ ప్రతినిధులు రాజు, వినోద్‌కుమార్, మధు, మూర్తి, శర్మ, స్వామి, సీతారామరాజు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నేటికీ ద్వితీయ శ్రేణి పౌరులుగానే మహిళలు

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి ఆవేదన



సదస్సులో మాట్లాడుతున్న సుబ్బారావమ్మ



సదస్సుకు హాజరైన మహిళలు

అనకాపల్లి: అన్ని మతాలు మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నాయని, వంటింటికి పరిమితం చేయాలని చూస్తున్న పరిణామాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావమ్మ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ, ఐద్వా, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సావిత్రిబాయిపూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ సదస్సుకు ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. మహిళలు తమ హక్కుల కోసం ప్రపంచ వ్యాప్తంగా పోరాడారన్నారు. పురుషులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, ఓటు హక్కు కావాలని, ఆస్తిలో హక్కు ఇవ్వాలని, మహిళలపై హింస అరికట్టాలంటూ అనేక పోరాటాలు చేశారన్నారు. రష్యాలో సోషలిస్టు సమాజం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా మహిళలకు ఓటుహక్కును కల్పించాలని, భారత దేశంలో ఆలస్యంగా ఇది వచ్చిందన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు దూసుకెళ్తున్నప్పటికీ బానిసలుగానే చూస్తున్నారని వాపోయారు. సైన్యంలోనూ సమానంగా మహిళలు ప్రస్తుతం పాటుపడుతున్నారన్నారు. రోజురోజుకీ మహిళలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో లైంగిక దాడులు, గృహహింస పెరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఐక్యంగా అందరం పోరాడాలని, శ్రామిక మహిళలు ఇంటిపని, బయటి పనులతో మరింత ఒత్తిడికి గురవుతున్నారని వాపోయారు. ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ వరలక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం, ఐక్య ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా శాంతి పార్కు



పట్టణ వాసులతో సందడిగా శాంతి పార్కు

తుమ్మపాల: ఉరుకులు పరుగులు తీసే పట్టణ వాసులకు ఆహ్లాదాన్ని కలిగించేందుకు శారదానది ఒడ్డున శాంతి పార్కు అధునాతనంగా తయారైంది. ఈ పార్కు కొన్నేళ్లుగా వ్యర్థాల బారిన పడి దుర్గంధంగా మారింది. జీవీఎంసీ, ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.58లక్షలతో ఆధునికీకరణ పనులు చేయడంతో పార్కు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు సేద తీరేందుకు అన్ని వసతులు కల్పించారు. ఆట వస్తువులు, జారుడుబల్లలు, రకరకాల ఏర్పాట్లతో పార్కు సుందరంగా తయారైంది. నిత్యం ఉదయం, సాయంత్రం పట్టణ వాసులు పార్కులోనే సేద తీరుతున్నారు. ఆటపాటలతో సరదాగా సందడి చేస్తు పిల్లలతో పార్కు పరిసరాలు నిండుగా కనిపిస్తున్నాయి.

ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

రాంబిల్లి: సెజ్‌లో టీజే కంపెనీ ప్రతినిధులు ఆదివారం రాంబిల్లిలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సెజ్ ఏర్పాటు చేయడంతో వేలాది మంది ఇక్కడి పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారన్నారు.

తీరంలో పుణ్యస్నానాలు



పెంటకోట తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు



పాల్మన్‌పేట తీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు

పాయకరావుపేట: అమావాస్య సందర్భంగా భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. శని, ఆది వారాలు కూడా అమావాస్య ఉండటంతో తుని, కోటనందూరు, పాయకరావుపేట మండలాలకు చెందిన పలువురు భక్తులు పెంటకోట, పాల్మన్‌పేట, వెంకటనగరం, రాజవరం తదితర సముద్ర తీర ప్రాంతానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. మెరైన్ పోలీసులు ఆయా తీర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా 'నమామి సాయి శత రుద్రీయం'



వేచలంలో సత్యసాయికి పూజలు చేస్తున్న శ్రీహరి ప్రసాద్ శర్మ, వైశ్యరాజు కృష్ణంరాజు

దేవరాపల్లి : మండలంలోని వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భగవాన్ సత్యసాయి బాబా 100వ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 75వ ×నమామి సాయి శత రుద్రీయం ×కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పరవశించిపోయారు. ముందుగా సత్యసాయి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికలకు సిద్ధం కండి

- పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, సమన్వయకర్త కంబాల జోగులు



పెంటకోట సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడప్రసాద్



బూత్ కన్వీనర్లతో కలిసి కిట్లు ప్రదర్శిస్తున్న బొడ్డేడ ప్రసాద్, సమన్వయ కర్త కంబాల జోగులు

పాయకరావుపేట: ప్రతీ బూత్ కమిటీ కన్వీనర్ ఎన్నికలకు సిద్ధం కావాలని, త్వరలో సార్వత్రిక ఎన్నికల సమయం వచ్చిందని నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పాయకరావుపేట పట్టణంలోని జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా కార్యాలయంలో, పెంటకోట గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు స్వగృహంలో వేర్వేరుగా బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశం జరిగింది. పట్టణ సమావేశంలో సమన్వయకర్త కంబాల జోగులు మాట్లాడుతూ ప్రతీ బూత్ కన్వీనర్ ప్రణాళిక బద్ధంగా ఓట్లు వేయించుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగాలంటే మరలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే మనందరం ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం బూత్ కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేసారు. పెంటకోటలో కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరై మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రతీ ఓటరుతో ఓటింగ్ చేయించుకోవలసిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఈ సమావేశాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండలాధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి దేవవరపు రాజేష్ ఖన్నా, సర్పంచ్‌లు పన్నీరు బాబ్జి, పడాల సోమన్నదొర, కోడ కోటేశ్వరరావు, గెద్దమూరి శ్రీనివాసరావు, మేడిశెట్టి రామగోవిందు, సకిలేటి రాము, యన్నంరెడ్డి లోవరెడ్డి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పక్కుర్తి లోవకుమార్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కొంకిపూడి రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చోడిపల్లి శ్రీను, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఆయా బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.